క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, పునర్వసు, నక్షత్రం తదియ తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు.. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

12న పాఠశాలలు పునఃప్రారంభం

యద్దనపూడి: ఈనెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నట్లు ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యేశ్వరావు, ఎంఈవో-2 గోపి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలో 34 ప్రభుత్వ పాఠశాలల్లో 1905 మంది విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ, ఆయా పాఠశాలల పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా ప్రణాళిక రచించి విద్యాసామగ్రి సరఫరా చేయనున్నట్లు వారు తెలిపారు.

13న హనుమాన్ శోభాయాత్ర

చీరాల: చీరాల పట్టణంలో ఈనెల 13న హనుమాన్ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. హనుమాన్ శోభాయాత్రకు హాజరు కావాలంటూ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు ఆహ్వానం అందించారు. అలానే హనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.ఫణిరాజా, కార్యదర్శి వెంకటేశ్వరరావు, పి.సాంబశివరావు, టి.చంద్ర, గజవల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు రోటరీ క్లబ్ నివాళులు



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పత్రికా, సినీ, వ్యాపార రంగాల్లో రామోజీరావు చేసిన సేవలు మరువలేనవన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు దేవపాలన, దివాకరదత్తు, మలాది శ్రీనివాసరావు, అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, షేక్‌మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, బీ. పూర్ణచంద్రావు, ట్రెజరర్ కొల్లా భవనేశ్వరీ, సెక్రటరీ చప్పిడి వీరయ్య

బాలికల వసతి గృహంలో దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ: మార్టూరులోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో 2024-25 సంవత్సరానికి బాలికలు చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌డబ్ల్యూవో రాజేశ్వరీ శనివారం తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరులకు రిజర్వేషన్ ప్రకారం సీట్లు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90529 08845 నంబర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లాలోని ఏ ప్రాంతం వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని రాజేశ్వరీ అన్నారు.

పోలీసు స్టేషన్‌కు ఏసీ బహూకరణ

చినగంజాం (పర్చూరు): దేవరపల్లి ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్ పర్చూరు పోలీసు స్టేషన్‌కు శనివారం ఒక ఏసీని బహూకరించారు. పర్చూరు పోలీస్ స్టేషన్లో నూతనంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉండేందుకు ఒక గదిని ఏర్పాటు చేశారు. అందులోకి కావాల్సిన ఏసీని సీఐ సీతారామయ్యకు బహూకరించారు. దాత కృష్ణమోహన్‌కు పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మూగ జీవాలు జాగ్రత్త

- వానాకాలంలో జాగ్రత్త
- జీవాలకు వానకాలంలో వ్యాధులు సోకే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోకుంటే జీవాల ప్రాణాలకే ముప్పు
- పశువైద్యుల సూచనలు పాటించాలి
- ఎప్పటికప్పుడు అప్రమతంగా ఉండాలి



పొలంలో మేస్తున్న గొర్రెలు (ఫైల్)

అద్దంకి: నోటితో చెప్పలేని మూగజీవాలను ఓకంట కనిపెడుతూనే ఉండాలి. వ్యవసాయ రంగంతో పాటు పాడిపశువులు, ఇతర జీవాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వానకాలం రాకతోనే పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకుతుంటాయి. ఆ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఆయా వ్యాధుల బారి నుంచి పశువులకు జీవాలకు ప్రాణహాని కలుగకుండా చూసుకోవచ్చని పశువైద్య నిపుణులు చెప్తున్నారు. ఆయా వ్యాధుల గురించి తెలుసుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటే పశువుల ప్రాణాలు పోకుండా కాపాడుకోవచ్చంటున్నారు పశువైద్యులు.

బ్లూటరింగ్ ఫుట్‌రాట్ లక్షణాలు..

గొర్రెలు, మేకల్లో బ్లూటరింగ్ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవులు దద్దరించడం (వాయడం), నోటి లోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్ల కుంటడం, ఒంట్లో నీరు చేరడం పారుకోవడం, మేత మేయకపోవడం అలాగే చూడి పశువుల అయితే ఈసుకపోవడం (అబార్షన్) 30 శాతం వరకూ మరణాలు కలిగే విధంగా ఈ వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఈవ్యాధి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందకు వేపాకు పొగ పెట్టుకుంటూ, అప్పుడప్పుడూ బ్లూటాక్స్ టిక్కెల్ మందులు పిచికారీ చేస్తూ పాడి ప్రదేశాల్లో మందను మేతకు తోలుకెళ్లాలి.

కాళ్లపుండ్ల వ్యాధి సోకితే..

జీవాలకు కాళ్లపుండ్లు వాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి చెడువాసన వస్తుంది. ఈవ్యాధి సోకిన గొర్రెలు కుంటుతూ నడుస్తాయి. ఈలక్షణాలు కనిపించినపుడు జీవాలను బురద ప్రాంతాల్లో మేత మేపకూడదు. పాడి ప్రాంతంలోనే మేత మేసే విధంగా చూడాలని వైద్యులు చెప్తున్నారు.

గొంతువాపు వ్యాధి..

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతు వాపు వ్యాధి ఒకటి. ఇది చాలా ప్రమాదకరమైన వ్యాధి. ఈవ్యాధిని గురకవ్యాధి అనికూడా అంటారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మ జీవుల వల్ల సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీటి ద్వారా మేత ద్వారా పశువులకు సోకి రోగనిరోధకశక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధి బారిన పడతాయి. వ్యాధి బారిన పడిన పశువులు మిగిలిన పశువులతో కలిసి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన వాటికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఒకే పాకలో మిగతావాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. అలాగే వర్షాకాలంలో పశువులు వర్షాలకు తడవకుండా చూడాలి.

నివారణ చర్యలు..

జూన్, జులై, ఆగస్ట్ నెలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వ్యాధి సోకిన పశువులను మిగిలినవాటి నుంచి వేరు చేయాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలి.

చిటికె వ్యాధి..

ఇది గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. ఎంటరోటాక్సీమియా అనే బ్యాక్టీరియా వల్ల తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఈవ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఏడాది వయస్సు గల గొర్రెల్లో వ్యాధి వస్తుంది. ఈవ్యాధి సోకిన గొర్రె తక్కువ సమయంలోనే మరణిస్తుంది. వ్యాధి సోకిన గొర్రెలు నీరసిస్తాయి. కొద్దిసేపటికే గిలగిలా కొట్టుకుని మరణిస్తాయి. ఈవ్యాధి లక్షణాలు ఉదయం మధాహ్న వేళల్లో గొర్రెల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను గొర్రెల మంద నుంచి వేరు చేయాలి.

వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి..



సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలి. లక్షణాలు తెలియకుంటే పశువులకు ఆయా వ్యాధులు సోకి మరణించే ప్రమాదం ఉంది. ముందుగానే ఆయా వ్యాధులు రాకుండా టీకాలు వేయించుకోవడం, వస్తే వైద్యుల సూచనలు సలహాలతో మందులు వాడితే ఆయా వ్యాధుల నుంచి పశువులను, గొర్రెలను రక్షించుకోవచ్చు. పశువులకు వ్యాధులు సోకినట్లు గుర్తిస్తే దగ్గరలో ఉన్న పశువైద్యులను కలసి వాటికి సకాలంలో వైద్యం అందిస్తే రక్షించుకోవచ్చు.

– ఏడీ మోహనరావు



పేదలకు అల్పాహారాన్ని అందిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

పేదలకు అల్పాహారం పంపిణీ

చీరాల అర్బన్: నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక చిన్నరథం సెంటర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద పేదలకు అల్పాహారాన్ని అందించారు. ముందుగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేతు విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేతాజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమానికి నేతాజీ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు చుండూరి కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి, సభ్యులు రామారావు, మణిబాబు, రవికుమార్, చంద్రమౌళి, కొత్త వెంకటేశ్వరరావు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అవధూతేంద్రస్వామివారి జయంత్యుత్సవాలు



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో అవధూతేంద్ర స్వామివారి ప్రతిమ



కారంచేడు హరేరామ ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కారంచేడు: స్థానిక హరేరామ ఆశ్రమంలో అవధూతేంద్రస్వామివారి జయంతి మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. కారంచేడు హరేరామ జపయజ్ఞ పీఠాధిపతులు ప్రణవానంధగిరిస్వామి వారి ఆశీస్సులతో శనివారం ఉదయం నుంచి హరేరామ జపయజ్ఞ ఆశ్రమంలో ఈ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హరేరామ హరేరామ రామరామ హరేహరే.. హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే అంటూ నేడు అనేక భజనా కార్యక్రమాల్లో వినిపించే స్లోకాన్ని అవధూతేంద్రస్వామివారి పలుకుల్లోనే జాలువారాయన్నారు. వారి ఆశీస్సులతో ఈ హరేరామ నామ జపమును ప్రతి ఒక్కరూ సంతోషంగా వల్లిస్తున్నట్లు ఆశ్రమ గురూజీ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని సుమారు 20కి పైగా ఉన్న బజన బృందాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలను నిర్వహించారు. బృందాలకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కారంచేడు, చీరాల, పర్చూరు, ఇంకొల్లు, బాపట్ల ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం



సంతమాగులూరులో పరిశీలిస్తున్న ఎంఈవో



అద్దంకిలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 సుధాకరరావు

- ఎమ్మార్సీలకు చేరిన పాఠ్య పుస్తకాలు
- తెరిచిన రోజే పుస్తకాల పంపిణీ

అద్దంకి: విద్యార్థులకు వేసవి సెలవులు ఈనెల 12తో ముగియనున్నాయి. దాంతో 2024-25 విద్యా సంవత్సరం మొదలు కానుంది. విద్యార్థులు ఆటల విడుపుకు సెలవిచ్చి బడిబాట పట్టేందుకు సిద్ధం అయ్యారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలను సిద్ధం చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నం అయింది. ఇప్పటికే 75 శాతం పైగా పుస్తకాలు ఎంఆర్సీ కార్యాలయాలకు చేరినట్లు ఎంఈవోలు ధ్రువీకరించారు.

పుస్తకాలు రెడీ..

ప్రధానంగా రాతపుస్తకాలు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. అదే విధంగా పుస్తకాలకు సరిపడే విధంగా విద్యాకానుక కిట్లు, ఏక రూప దుస్తులు ఆయా మండల ఎంఆర్సీ కార్యాలయాలకు చేరనున్నాయి. పాఠశాలలు తెరచిన రోజు నుంచే ఒకటి నుంచి ఆరు తరగతుల్లో విద్యార్థుల చేరికలు ప్రారంభం అవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండల పరిషత్‌ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలతో కలిపి మొత్తం 257 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 23,365 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందుకుగాను 72,265 పుస్తకాలు మండల ఎంఆర్సీ కార్యాలయాలకు చేరాయి.



బల్లికురవ ఉన్నత పాఠశాల

సిద్ధమైన పాఠశాలలు..

నెల రోజుల క్రితం వేసవి సెలవుల నేపదయలో మూత వేసిన పాఠశాలలను మళ్లీ ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఏదైనా చిన్నచిన్న మరమ్మతులు వంటివి ఉంటే వాటిని ప్రధానోపాధ్యాయులు చేయించు పనుల్లో నిమగ్నం అయ్యారు. మొత్తం మీద ఈ నెల 12 నుంచి పాఠశాలల్లో నూతన అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి.

నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు..

మండలం	విద్యార్థుల సంఖ్య	ఎంపీపీ స్కూల్స్	యూపీ స్కూల్స్	హై స్కూల్స్
అద్దంకి	6677	57	06	13
కొరిశపాడు	3000	26	03	06
బల్లికురవ	5300	41	07	08
సంతమాగులూరు	4788	39	06	13
జే పంగులూరు	3600	32	06	06

అడ్మిషన్లు ప్రారంభం..

పాఠశాల ప్రారంభించిన రోజు నుంచే అడ్మిషన్లు ప్రారంభం అవుతాయి. కార్పొరేట్ పాఠశాలల్లోనూ ఒకటో తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హత ఉన్నవారిని గురించి వారిని ఆయా కార్పొరేట్ పాఠశాల్లో చేర్పించాం. వారికి అడ్మిషన్లు ఇవ్వడంలో ప్రైవేటు పాఠశాలలు జాప్యం చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులు పట్టణాల్లో రూ.8 వేలు, గ్రామాల్లో అయితే రూ.6 వేలు చెల్లిస్తే సరిపోతుంది.

– బీ గంగాధర్, ఎంఈవో

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



స్వర్ణలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హస్మప్రియ

స్వర్ణ (కారంచేడు): గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు క్రమంతప్పకుండా మీ సమీప ఆరోగ్య కేంద్రాల్లో తప్పకుండా అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హస్మప్రియ అన్నారు. శనివారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన గర్భిణుల వైద్య పరీక్షల్లో పాల్గొని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సలహాలను అందించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు మూడో నెలలోనే మీ ప్రాంత ఆశ, ఏఎన్ఎంల వద్ద మీ పేరు, ఊరు, అడ్రస్, వైద్య పరీక్షల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. అప్పటి నుంచి వారు మీకు అందుబాటులో ఉంటూ మీకు అవసరమైన అన్ని ఇంజక్షన్లు చేస్తూ ఇంకా అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తారన్నారు. ముఖ్యంగా రక్తహీనతతో ఇబ్బందులు పడే వారి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. మీ బ్లడ్ గ్రూప్‌నకు తగిన రక్తనిల్వలు కూడా అందుబాటులో ఉంచుతారన్నారు. సుఖ ప్రసవం వరకు మీకు అవసరమైన అన్ని సేవలందిస్తారన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 23 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తొలుత నటరాజ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ కీ బోర్డు ప్లేయర్ ఎస్‌కే బాబు ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరిలో గాయని గాయకులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో ఈ నెలలో మరణించిన కళాకారులను గుర్తు చేసుకొని నివాళులర్పించారు. అనంతరం చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, సహ కార్యదర్శి ఏల్చూరి అనంతలక్ష్మి, ఎంవీవీపీ బాబురావు, దిగ్విజయ్, మాకా ఆంజనేయులు, జాలాది మోహన్, కేవీ రంగారావు, నల్లమల్లి పాండు రంగనాథ్, తులసి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జేవీవీ జోనల్ స్థాయి వర్క్‌షాప్

ఒంగోలు టౌన్: ప్రజా చైతన్యమే లక్ష్యంగా పని చేస్తున్న జనవిజ్ఞాన వేదిక వివిధ అంశాలపై ఒంగోలులోని ఎల్బీజీ భవన్‌లో ఆదివారం జోనల్ స్థాయి వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్ జయప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన కమిటీ సభ్యులు, ఎంపిక చేసిన ప్రతినిధులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రజా సైన్స్ ఉద్యమం – తాత్విక పరిజ్ఞానం, శాస్త్రీయ ధృక్పథం– వ్యాప్తికి ప్రాథమిక రంగాలు, సంస్థాగత నిర్మాణ కర్తవ్యాలు, శాస్త్రీయ ప్రచార పద్ధతులు వంటి అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించనున్నట్లు వివరించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం గేయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్‌లు ఈ వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించనున్నారని తెలిపారు. శాస్త్రీయ సమాజ ఏర్పాటు కోసం జరుగుతున్న కృషిని మరింత బలోపేతంగా ముందుకు తీసుకెళ్లేందుకు వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల కార్యదర్శివర్గ సభ్యులు, మండలాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరై వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు.

అభయాంజనేయుడికి విశిష్ట పూజలు



అభయాంజనేయుడికి పూజలు చేస్తున్న అర్చకుడు



ప్రత్యేక అలంకరణలో గణపతి ఆంజనేయుడు

బల్లికురవ: కళాశాలలు ప్రారంభం జ్యేష్ఠ మాసం విదియ సందర్భంగా మండలంలోని కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న అభయాంజనేయుడికి శనివారం విద్యార్థులచేత విశిష్ట పూజలు చేపట్టారు. రామభక్త పరాయణుడు, బహుపరాక్రమశాలి ఆంజనేయుడిని పూజిస్తే విద్య, ఉద్యోగం, వ్యాపారంతో మంచి ఫలితాలు వస్తాయని కొత్తపాలెం ఆలయ అర్చకులు ఐనవోలు సుబ్బాచార్యులు అన్నారు. ఆంజనేయుడికి గణపతికి పంచామృతాలతో అభిషేకం, సింధూరపూజ తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పూజల్లో భాగంగా గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ చదువులకు వెళ్తుండగా వారందరికీ అర్చకులు వేద ఆశీర్వచనంతో ఆంజనేయుడు గణపతి ఆశీస్సులు అందజేశారు. గ్రామానికి చెందిన కోయా అంకమ్మరావు, పులిహోరా, పొంగళి ప్రసాదాన్ని తయారుచేసి అందించగా విద్యార్థులు భక్తులకు పంచిపెట్టారు.